# పాతాళగంగ

చేదలో గంగ సాక్షాత్కరించింది. బేటప్పలోని ప్రత్యంగమూ పులకరించింది. తలకశంలో స్నానం చేస్తుండిన నంది కృష్ణయ్య ఆ దారిలోనే వచ్చి నిలిచాడక్కడ. ఎల్లమోళ్ల కుంటలో ఏతాం త్రొక్కుతున్న కంచెర్ల పెంచలయ్య గబగబా పరుగెత్తి వచ్చాడు.

బేటప్ప కనులను చేటలంత చేసికొని చేదవైపే చూస్తున్నాడు. "రెండున్నర మట్టులోనే భూమి గండిపడి చేద నిండి పోతున్నదే" అన్నాడు కృష్ణయ్య. "అవునవును! బేటప్ప అదృష్టవంతుడు! కరణం ఏకాంబర పిళ్ళతో చెప్పి లోనుకు అర్జీ వ్రాయవయ్యా. సబ్సిడీ, లోనూ కలిపి రెండు వేలిస్తారు. బావి పూర్తి అయితే ఈ నేలే బంగారమైపోతుం"దన్నాడు పెంచలయ్య. "ముందు గంగపూజ కానియ్యవోయ్" అన్నాడు కృష్ణయ్య.

"నాకేం తెలుసు స్వామి, ముందు వెనకలు, అదేదో మీరే తలపడి జరిపితే మీ బిడ్డలు చల్లగా ఉంటా"రన్నాడు బేటప్ప. "సరే, ఇంటికి వెళ్లి వచ్చేలోగా బూడిద గుమ్మడికాయ, కర్పూరం, టెంకాయ, కుంకం, పసుపు, గంధం పొడి, పూలు, వక్కాకు నానబియ్యం– ఇవన్నీ తీసుకుని ముగ్గురు ముత్తైదువుల్ని పిలుచుకరా" అని క్షణం ఆగి "ఆఁ... గరిక పోచలు, తుమ్మిపూలు కూడా కావాలి మరిచే"వంటూ వెళ్ళిపోయాడు కృష్ణయ్య. "నువ్వూ ఉండు పెంచలన్నా! మడిపారిందే వెళ్లిపొయ్యే" హెచ్చరించి, బేటప్ప ఆదరాబాదరా ఊరివైపు దారి తీశాడు.

చేదలో నీళ్లు పడితే సిరెత్తుకొన్నట్లే. బసవయ్య పది చేదలెత్తినా పుక్కెడు నీళ్లూరని పోతురాజు మిట్టలో రెణ్ణరమట్టులోనే గంగ తొంగిచూచిందంటే బేటప్ప హృదయం పొంగులెత్తకుండా ఎల్లా ఉంటుంది?

ఇంట్లో అడుగు పెడుతూ "ఒసేయ్ చెంగీ, నీరు పడిందే చేదలో, నీళ్లే నీళ్లూ!" అంటూ కేకేశాడు బేటప్ప. అప్పుడే పొంగుతూ ఉన్న పాలపై నీళ్లు చల్లి దించి

పెడుతున్న చెంగమ్మ చెవుల్లో ఈ శుభవార్త పడగానే ఆమె కళ్లూ చెవులూ కలిసే పోయినవి. ఎలా తెలుసుకొన్నదో పాలు త్రాగుతూండిన లేగదూడ పరుగుతో వచ్చి చెంగమ్మ చీరె కొంగును కశకశమని నమిలేస్తున్నది. ఆనందం పట్టలేక ఆ ఇల్లాలు లేగ నమాంతం ఎత్తి ముద్దిడుకొని వాకిట్లో దించి, తిన్నెపై తవుడు బుట్టలో ఉన్న ఎన్నెద్ర చివుళ్లను దాని నోటికందిస్తూ పెదిమల్ని మెదపగానే "పెసల రంగయ్య శెట్టి అంగిట్లో పెదగుమ్మడి కాయాలుంటాయటే" అన్నాడు బేటప్ప. "కూత దూరమేగా వెళ్లొస్తే"– అన్నది చెంగమ్మ కొంగుకైన లేగ చొంగ తుడుచుకొంటూ.

బేటప్ప బటువా సంచి తీసుకొని ఇంటిమొగసాల దాటుకోగానే ఖణేల్మని రంకె వేసింది దేవర ఎద్దు. ఎంతమంచి శకునం! చరచరా వెళ్లిపోయాడు బేటప్ప.

పొరగాలనకు చెరుకుమోసులకు వెళ్ళిన కస్తూరి ఇంటికి రాగానే "అబ్బోడికి జాబురాయవే, చేదలో నీరుపడిందే నీ ఇల్లు బంగారంగాను!"అన్నది చెంగమ్మ. అబ్బోడి మాట వినగానే పసుపు కొమ్ము వలె నిగనిగ లాడే కస్తూరి తనూలత కుంకుమ వన్నెల విసనకర్ర అయి కమ్మని వలపు వాసనలను దశదిశలకు పంచిపెట్టింది. ఇంటికొప్పుపై నర్తిస్తున్న ఉడతల జంట ఎవ్వరికీ తెలియరాని విశేషాలనేమో ఎంతో గోప్యంగా ముచ్చటించుకొంటున్నది. ఎన్నుగాటికి ఉత్తరపు కొనలో ఊరు పిచ్చుకలు అంతకంటే మక్కువతో ముక్కులను రాచుకొంటున్నవి.

బేటప్ప కొక్కడే కొడుకు. ఉప్పుగల్లు. శివరాత్రి నాడు మొగిలి తిరునాళ్ళకు వెళ్ళివస్తానని చెప్పి చిత్తూరికి దౌడుతీసి దండులో చేరిపోయాడు. అమ్మ తిట్టకున్నా అయ్య కొట్టకున్నా ఇట్లా ఎందుకు చేరాడని ఆచూకీ తీస్తే మిలటరీ రామయ్య సెలవుల్లో వచ్చినప్పుడు అతడి సావాసంతో సైన్యంలో చేరాలని మోజుపడి వెళ్ళి పోయాడని తేలిపోయింది. చెంగయ్య అన్న కూతురు తల్లిలేని పిల్ల కస్తూరిని అబ్బోడికిచ్చి మూడు ముళ్ళూ వేయించాలని అందరూ అనుకొన్నారు. మిలటరీలో చేరినా నిలిచే పెళ్ళి కాదది.

ఊళ్ళో ఆడా, మగా అందరూ కాకున్నా చాలామందే వచ్చారు గంగ పూజకు. గంగపై తమలపాకుతో మండే కర్పూరాన్ని చూచి దండం పెట్టుకున్నారు. ప్రసాదంగా ఇచ్చిన పొడిబెల్లం నాన బియ్యాన్ని నములుతూ బేటప్ప అదృష్టాన్ని గూర్చి గోరంతలు కొండంతలుగా చెప్పుకొన్నారు. "పది గుంటలు కాకపోతే,

పాతిక గుంటలైతే మాత్రమేం? బంగారు కోనేరు లాంటి బావి పడుతుంది. పని నిలపకయ్యా" వెన్ను చరిచి వెళ్ళిపోయారు.

నిరుడు సెనక్కాయల్లో వచ్చిన డబ్బులో వరుమానం ఇన్నూట నలభై రూపాయలున్నవి. పని ఆరంభమైతే ఏదో వరుమానం రానే వస్తుంది. సబ్సిడీ రాకున్నా లోను ఆగుతుందా? బావి పని మొదలు పెట్టాడు బేటప్ప. వడ్డెపల్లె నడిపి బోయడు పనిలో దిగాడు. ముందుగా బిడుగందుకోమన్నాడు బేటప్ప. గుంటలు గుంట ఆరు రూపాయలు. ఒక కురపొట్టేలు, నాలుగు జతల పంచలు ఇనాము. అంతే ఒప్పందం.

పంజాబు నుండి అబ్బోడి ఉత్తరం అందింది. ఎంతైనా సరే వెనక్కి జంక కుండా బావి పూర్తి చేసి తీరాలని వ్రాశాడు. బేటప్ప ఏకాంబరం పిళ్ళ దగ్గరికి కాలికి బలపం కట్టుకొని తిరిగాడు. అది ఎటూ వస్తుంది కనుక తట్టుకోవచ్చుననే ధైర్యంతో చెంగమ్మ గజ్జెలడ్డిగను దండు నాయబు దగ్గర కుదువపెట్టి రెండు వందలు తెచ్చాడు. మూడోమట్టు దాటీ దాటగానే మొరుం వచ్చింది. మొరుమే వస్తే నీటికి కరువేలేదు. టెంకాయ పాలవలె ఉంటాయన్నారు అనుభవజ్ఞులు. తవ్వుతూ తవ్వతూ పోతుంటే ఆగ్నేయంలో చేప పలుకులే కనిపించాయి. చేప పలుకు రాయిపగిలితే చెప్పనెందుకూ? నీళ్ళు జల్లెడపడ్డట్లే.

దేనికైనా మంచిదని గజ్జెలడ్డిగను అమ్మిన విషయాన్ని అబ్బోడికి జాబు వ్రాసింది కస్తూరి. కస్తూరి కమ్మ అందగానే అబ్బోడొక వంద పంపాడు. బావి నాలుగో మట్టులో రాయి కన్పించింది. అది మొరుం రాయిలే అంటూ నడిపి బోయడు మొలతో పని మొదలు పెట్టాడు కాని బెత్తెడైనా తెగకముందే ఉత్త చట్టబండని తేలిపోయింది.

బావిలో బండ పడిందన్న సంగతి అబ్బోడికి వ్రాయవద్దని శాసించాడు బేటప్ప. అప్పుడే పాకిస్తాన్‌తో సమరం ఆరంభమైనది. ఇంటి దిగు లిసుమంతైనా కొడుక్కి లేకుండా ఉండాలని బేటప్ప ఆలోచన. కస్తూరి కూడా ఈ విషయాన్ని దాచి పెట్టేసింది. బావిని తవ్వుతున్నారని మాత్రం వ్రాస్తున్నది. ఆమెకు రెండు సమస్య లెదురైనవి. ఏ ఒక్కటినీ తట్టుకోలేని లేత గుండె పాపం! మామ యుద్ధంలో గెలిచి రావాలి. ఆలోగా బావి పని పూర్తి కావాలి. అప్పుడు గదా పెండ్లి!

"ఆనంద మానంద మాయనే –

మన అబ్బోడు పెండ్లి కొడుకాయనే –

కన్నె కస్తూరి పెండ్లి కూతురాయనే...
బ్రహ్మానంద మానంద మాయనే!
చిలకా గోరింకాలు కలిసిన జంట.
బలే వలచిన పంట
దామ గుంట పువ్వుల్లో – కనిపించాయంట!" అంటూ పెళ్లి సన్నాయి వినిపిస్తే పదిమందీ చూస్తూంటే బాసికం కట్టిన మామతో వసంతాలాడాలనీ, ఉయ్యేల లూగాలని, అరిమేని కుండలో చేయీ చేయీ కలిపి ఉంగరం కోసం గాలించాలనీ, తన్ను గిల్లి పెడితే తానూ గిల్లి పెట్టాలనీ, ఒంటినిండుకూ కదుం పొడి చల్లాలనీ, సున్నిపిండి పుయ్యాలనీ, నలుగులు పెట్టాలనీ– ఓహోహో, చెప్పనెందుకూ? ఏవేవో కమ్మని ఊహలతో తియ్యని కోరికలతో క్షణమొక యుగంగా గడుపుతున్నది కస్తూరి!

వేసవి చంద్రనిప్పుల్ని చెరుగుతున్నది. బావి వెడల్పునా బండ తేలిపోయింది. కరణం ఏకాంబరం పిల్లె వందా యాభై పుచ్చుకొన్నాడు. ఆ పై వారికి ముట్ట చెప్పడానికని పాత సిరు మానమేదైనా ఉంటే పైకి తియ్యమని కోరాడు, కోరుతూనే ఉన్నాడు. బేటప్ప కొండల్లాంటి కోడెల్ని అమ్మివేశాడ. అవి మూపురాలు కదిలిస్తే గోపురాలు ఊగుతున్నట్లుండేవి. కొనగొమ్ముల్లోని కంచు కుప్పెలపై గిగిరెట్లు బసవగుడి ధ్వజస్తంభం ఘంటానాదాలను ప్రతిధ్వనించేవి. పాలగవ్వల పట్టెడ మువ్వల సవ్వడిలో ప్రణవం విన్పిస్తుండేది. నాగలమ్మ మండపం ముందు సంకురాతిరి బండనీడ్చిన ముక్కంటి సుళ్ల మైల వన్నెల కోడెల్ని పది వేలకైనా ఇచ్చే పంటకాపున్నాడా? వాటిని తోలుకుపోతుంటే విశ్వామిత్రుని వెంబడి వెడుతున్న రామలక్ష్మణులను చూచి విలపించిన దశరథ మహారాజువలె వలవల మంటూ విలపించాడు బేటప్ప. ఆ దృశ్యాన్ని చూచిన వారి కన్నులలో పెన్నలు పుట్టినవి!

గజానికి గజం ఐదు తక్కువ నూరు లెక్కన మలబారోళ్లు పనికి ఒప్పు కొన్నారు. చెయ్యి పెట్టారంటే కొండంత బండనైనా పిండికొట్టి తినేస్తారని ప్రతీతి. బావిలోని వత్తికి నిప్పంటించి తాడు పట్టుకొని పాకుతూ పైకి వచ్చే గుండె ధైర్యం వారికే ఉంది. వారు రాతిని తినే మాట దేవుడెరుగు కాని రైతును తినడాన్ని మాత్రం జగమెరుగును! కాకుంటే బేటప్ప, నాలుగు ఆవులూ, ఇరవై రెండు మేకలూ, చెంగమ్మ చెవుల్లో కర్నపూలు, గూబావర్లు, బొందుపోగులూ, నోముల

ముళ్లూ అమ్మివేస్తాడా! ఇంకేమున్నవి ఆ కమ్మలూ, మాటీలూ, నత్తూ, బులాకీలు తప్ప.

ఐదోమట్టు పూర్తికావచ్చింది. పై పొరలో చేదలో దోసెడు నీళ్లు కన్పించాయి. కానీ ఆ బండ పాతాళం వరకు పాతుకుపోయినట్లుంది. బేటప్ప వద్దంటున్నా వినకుండా కస్తూరి తెల్లరాళ్ల కమ్మలూ, నీలాల తొంగటాలు తీసిపెట్టింది. అదే మూలకు? ఒక్క రోజు నల్లమందుకు చాలదు. మణుగు నల్ల మందు నలభై రూపాయలు. గజం వత్తి చెడ్డచేటు పావలా, కాస్త తేమ కన్పిస్తే తోటా మూడు రూపాయలైనా సరే వంద తోటాలు పేల్చి బండను పగలతియ్యవచ్చు. మందుతో మైనం పెట్టినా ఏమంత లాభం లేకపోతున్నది. బెంగుళూరు కేపులైతే ఏనుగంత గుండైనా పిచ్చలైపోతుంది. అది పగిలితే రాకాసిబండైనా తునాతునకలే!

అబ్బోడి దగ్గిర నుండి జాబులే లేవు. పాకిస్తాన్‌తో యుద్ధం ముమ్మరంగా సాగుతున్నట్లు పత్రికల్లో వస్తున్న వార్తల్ని మాత్రం వింటున్నాడు బేటప్ప. అదీ రాత్రిపూట ఇంటికి వచ్చినప్పుడు కస్తూరి చెవుల్లో వేస్తున్నది.

అరటి బొద్దులా ఉన్న చెంగమ్మ అవిసె పుల్లలా తీసి పోయింది. బేటప్పకు తెలియకుండానే కమ్మలూ మాటీలను కుదువబెట్టింది. సత్యాన్ని గ్రహించిన బేటప్ప మౌనంతో ఉండిపోయాడు. ఏనాటికానాడు డబ్బు అందక పోవడంతో మలబారోళ్లు చెప్పకనే ఉడాయించారు. ఆరోమట్టులో కూడా బండనే పరచుకొన్న బావి 'అం....' అని చెరువంత నోరు తెరుచుకొని తొంగి చూచిన వారినెల్లా మింగుతానంటున్నది.

ఆ రోజు పూర్ణిమ. పండుజాబిల్లి పావురాల గుట్టపైకి ఎగబ్రాకి వస్తున్నాడు. బావిగుట్టపై కూర్చున్న బేటప్ప తన పొలం వైపు కలయ జూచాడు. బావిలో గంగపడి చేలపై నాగేలు నడయాడితే పదెకరాలూ వరిసాగుతుంది. అందులో ఐదెకరాలు చెరుకు సాగుబడైనా ఇరవై బండ్లు బెల్లం. అదృష్టం కలిసి వచ్చి గోనె రెండు నూర్లమ్మిందా పదహారు వేలు. నూటికిపై చిల్లరమ్మినా పదివేలకు తగ్గదు. సవరం లాంటి నేల. ఇదే చాలు. పొరగాలవ మడి ఇరవై గుంటల్ని దొంగల్దొత్తే మాత్రం పుట్టి మునిగిందా? ఏమైనా సరే గంగను కంటితో చూచేవరకు ఈ బావిని వదలననుకొంటూ ఇంటికి వచ్చాడు. కస్తూరి తల ఊపింది కానీ చెంగమ్మ అంగీకరించలేదు. పల్లె పల్లెంతా మూతలెత్తుకొని గంజి దొడ్డికి వెళ్లినా కడప దాటనివ్వకుండా కాపాడింది కాలవమడి ఒకటే గదా! గత ఫలితంలో రాలిన

కాశీ పిచనాలే నేడు కూడా తింటున్నది. అరగుంటలో కాసిన వంకాయ పిందెలు, కాలు గుంటలో పూసిన చేమంతి పూలు అమ్మితే మూణ్ణెల్లు సంతకు సరిపోయిందే. వారానికో, సారానికో ఇచ్చినా ఫలితానికి గుంటకు పందుమివ్వరా! తెలిసి తెలిసీ ఏటి కాలవ మడినీ ఊటకాలవ మాన్యాన్నీ తూము కాడ పాదుల్ని అమ్ముకొంటారా ఎవరైనా! కొంద్రు మడి ఉంటే కోటి రూపాయలున్నట్లే గదా! కన్న తల్లిని పోగొట్టుకొన్న వాడు, నేలతల్లిని అమ్ముకొన్న వాడూ కడతేరింది కద్దా! చెంగమ్మ హృదయం కుంగిపోయింది. కుందనపు బంగారాన్ని కూటి నీళ్లకు దారపోసినట్లు పచ్చనోట్ల కాయితాలకు అచ్చివచ్చిన పంట పొలాన్ని అమ్ముకోవడమా! అయినా తప్పదు. బేటప్ప మాటకు అడ్డు తగిలితే ఊరుకోడు. బలే మోటు మనిషి, మొండి ఘటం!

పది గుంటలుంచుకొని పది గుంటల్ని అమ్మివేయమన్నది చెంగమ్మ. బేటప్ప అంతపనీ చేశాడు. కంచెర్ల పెంచలయ్యకు కాణి నూటయాభై లెక్కన ఇచ్చేశాడు. ఈమారు బావి పనికి దళవాయిపల్లె చోటా సాయబు దిగాడు. మందూ, వత్తీ బేటప్పదే. ఆ రోజుకారోజు కూలి ఖచ్చితంగా ఇచ్చే ఖరారు. అడుగూ అడుగున్నర తొలలు వేస్తున్నారు. మూరెడు నాటు నుండి బారెడు పొడవునా బండ పత్రలు పత్రలుగా చీలి పోతున్నది.

అబ్బోడు జాబు వ్రాశాడు. సాయోల్ కోట సమరాంగణంలో చొచ్చుకు పోతున్నామని. కస్తూరి పసిడిబుగ్గల అరుద్రల్లా అరుణిమలైనవి. ముత్యాల సరాల వలె ఆనందబాష్పాలు చెక్కిళ్లపై జాలువారుతూండగా చెంగమ్మ "మా నాయన ఏమని వ్రాశాడే?" అంటూ దగ్గరికి వచ్చింది. యుద్ధం జరిగే చోటులోనే ఉన్నాడంటే అత్త మంచాన పడుతుందని "బావున్నాడటమ్మా, మావ ఇంకో నెల్లో వస్తాడు సెలవుల్లో" అంటూ ముగించింది కస్తూరి. అబ్బోడు యుద్ధంలో గెలిచే వస్తాడని కస్తూరి గాథ విశ్వాసం. మూడేళ్ళ క్రితం కార్తీక దీపం నాడు సుదుదులు పట్టినప్పుడు పాపిసెట్టి కండిగె వాళ్లపై విరుచుకుపడ్డ ఉదంతం జ్ఞప్తికి వచ్చింది కస్తూరికి. అబ్బోడంటే అర్జునుడే అన్నారంతా! బలంలో మాత్రం సామాన్యుడా! కళ్లంలో బిగువంత వాడెనెత్తి మోదాడంటే తాలి కసువులో మందుకైనా వడ్లగింజ ఉంటే వట్టు.

చెంగమ్మ ఉత్తరాన్ని తీసికొని రెండు చేతుల తోనూ మడిచి ఉత్తరం వైపు తిరిగి ఏల్యమోడికి దండం పెట్టి మీదెత్తి కట్టాలని సంకల్పించుకొన్నది.

సయాల్ కోట సమరంలో అబ్బోడు శత్రువ్యూహాన్ని ఛేదించినట్లే బేటప్ప బావిలో బండల్ని పిండి చేస్తున్నాడు. అక్కడ ప్రేలుతున్నవి టాంకులు. ఇక్కడ చీలుతున్నవి బండలు. వేలను మింగుతున్న ఆ బావిని ఆ పరిసరాల జనపదాల నుండి ఎందరో రైతులదేపనిగా వచ్చి చూచివెడుతున్నారు. ఏడుమట్లు తెగినా ఎక్కడా నీటిపొర కన్పించలేదు. పుల్లశాస్త్రం చూచే పచ్చిక పల్లంఎల్లయ్య ఈ బావే సముద్రం కాకుంటే నా జన్మలో పుల్లనే ముట్టుకోనన్నాడు. తొంభై తోకబావులు, డెబ్బై గుండుబావులు, నలభై కట్నాల బావులు, లెక్కలేనన్ని బొట్ట బావులకు లగ్నాలు పెట్టిన నా మాటే తప్పయితే ఈ నాలిక తెగ్గోసుకుంటానన్నాడు.

దగ్గు దగ్గుగానే ఆగకుండా చెంగమ్మలో ఏదో ఆయాసం ముంచుకు వచ్చింది. మంచంపై బల్లిలా కరుచుకుపోయింది. ఇల్లాలు నేల బడగానే బేటప్పలో దైన్యం ఆవేశించినది. ఆ పది గుంటలమ్మిన పైకం సైతం కర్పూరంలా కరిగి పోయింది. కస్తూరి జీలుగ బెండువలె ఎండిపోతూంది.

ఏం చెయ్యాలిప్పుడు? బేటప్ప గట్టున కూర్చొని నుయ్యి లోనికి తేరిపార చూచాడు. ఇంకో ఐదుమట్లైనా సరే దీని అంతు కనుక్కోవాలనిపించింది. తలకశంలో తడిబట్టల్ని గుంజి ఆరవేసుకొంటూ నంది కృష్ణయ్య వచ్చి నిలబడ్డాడు. క్షణకాలం ఎవ్వరూ మాట్లాడలేదు.

"నాకు తెలుసు బేటప్పా నీ మనస్సులో ఉన్నది! ఏమై పోయిందిప్పుడింత దిగాలుపడి కూచోడానికి? కాలవమడి ఇరవైగుంటలు పోయినా, కలకండ లాంటి నేల నూటయాభై గుంటలాయె. ఆ పది గుంటలూ ఉండి ఎవర్ని ఉద్ధరించడానికి? అమ్మేయ్. ముందు ఆ చెంగమ్మను ధర్మాసుపత్రిలో చేర్పించి మందో మాకో చూడు" అంటూ సలహా ఇచ్చాడు నంది కృష్ణయ్య.

"అది సరేకాని ఆ ఏకాంబరం పిళ్లె ఎంత పని చేశాడో చూశావా?" అన్నాడు బేటప్ప. "అదా కనుక్కొన్నా. కందెనం కూడా తగిలించావటగా! జాయింటు పట్టాలో నీ బావిఉంటే లోనురాదు. మళ్లీ సబ్ డివిజన్‌కు రాయాలి. అది వచ్చి మాత్రం చాలుతుందా? సగం తోసి, సగం తీసి మిగిలిందే మిస్తారయ్యా వాళ్ళ?" అంటూ సాగబారాడు కృష్ణయ్య.

నంది కృష్ణయ్య మాటమీద బేటప్పకు నమ్మకం ఉంది. పొరకాలవ మడి పది గుంటలూ అమ్మేశాడు. కాలవకింద గోష్పాదమంతైనా లేకపోయింది. చెంగమ్మను ఆస్పత్రిలో చేర్చాడు. చేరిన ఐదో నాడే ఆ ఇల్లాలు కన్ను మూసింది.

కస్తూరి కాళ్లూ చేతులాడక బస్స్టాండుకు పరిగెత్తి ఊరికి కబురంపితే బేటప్ప వచ్చి బాడుగ వానులో శవాన్ని తీసుకు వెళ్లాడు. మారేడు చెట్టు క్రింద బావి గట్టున చెంగమ్మ భౌతిక దేహం సమాధి చేయబడినది. బేటప్ప వేదాంతి వలె "కస్తూరీ! అత్తవలెనే అందరూ చనిపోయే వారేనమ్మా. అబ్బోడికిప్పుడే జాబు వ్రాయకేం? ఉన్నట్టుండి వాడికి తెలిస్తే ఏమవుతాడో బిడ్డ" అని సముదాయించాడు.

దివసాలైన మరునాడే బేటప్ప బావిపని ఆరంభించడం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. అబ్బోడికున్న పొదుపు అంతా తీసి పంపిన ఆరువందలూ పది రోజులకు వచ్చినవి. తొమ్మిదో మట్టులోనైనా గంగ పొంగుతుందనే ఆత్మవిశ్వాసంతో ఐదంకణాల పూరి కొట్టాన్నీ అమ్మి వేశాడు. ఇల్లూ వాకిలీ పోయినా బావి గట్టున జోబిడీ వేసుకోవచ్చని బేటప్ప ధీమా. కాపురమున్న దివాణమంత ఇంటినీ అమ్మివేశాడు. ఇరవై అవిశలతో తాటిమట్టల గుడిసె వేశాడు బావి గట్టున బేటప్ప తల దాచుకోవడానికి.

చెంగమ్మ చేర్చి పెట్టిన కడియాల అండాల నుండి కంచు గిన్నెల వరకూ దండే వారికి తాకట్టు పోయినవి. బిల్లు కొయ్య కుండలతో టేకుమాని వంపులతో నల్లతుమ్మ దిండుతో బాగి ఆకులూ, పారులూ, నొగలతో తయారు చేసిన రెండెద్దుల బండినీ మూడు వందలకే దత్తం చేశాడు. చేనికి దక్షిణాన సైనికుల్లా కన్పించే పన్నెండు తాటిచెట్లు బావిలో వత్తులై కాలిపోయినవి. ఏడు తప్పినా మాసూలు తప్పని ఊరంత చింతమాను నాటుల్లో నల్లమందై మాడిపోయింది. చెంగమ్మ సమాధికి నీడనిచ్చే మారేడు చెట్టు తప్ప కట్టె కంపకు పనికి వచ్చే ముండ్ల చెట్ల సహా అన్ని ఫలవృక్షాలు కనిపించని గంగ కాహుతి చెయ్యబడినవి. బేటప్ప వెండి మొలతాడుతో పాటున్న పనసకాయ, చెవుల్లో మురుగులు, అంటుజోళ్లు, ముక్కుపోగు పోలికంటె మెట్టెలతో సహా బావి గట్టుపై నుండే ధారబోశాడు. సగం చచ్చి సగం చితికిన బేటప్పకు మిగిలినవి చేతులూ కాళ్లే. అన్నీ పోగొట్టుకొన్న బేటప్ప నడుము బిగించి బావిలో నుండి రాతి దిమ్మెల్ని సమ్మెటతో పగులగొట్టి గునపంతో పెకలించి పైకి మోస్తున్నాడు అతని తనువు లోని నెత్తురంతా గుండెలకు ప్రాకుతున్నది. ఆవజీవాలు బిగబట్టి, సమ్మెటతో జంబరు కమ్మిపై దెబ్బవేసినప్పుడు పాషాణమే కంపిస్తున్నది. ప్రళయ రుద్రుడో, అపర వీరభద్రుడో కాకున్న బేటప్ప కాశక్తి ఎట్లా పుట్టుకు వచ్చింది? కస్తూరి కమ్మిని కదిలిస్తున్నది. పనివారి కివ్వడానికి పైసా లేకున్నా బావి పని ఆగరాదనే

పట్టు. అచంచలమైన దీక్ష! అబ్బోడి గుండు దెబ్బల కక్కడి యుద్ధంలో ఎందరు శత్రువులు బలి అవుతున్నారో! ఆ బిడ్డ కక్కడ జాబు వ్రాసే తీరిక లేదు. ఈ తండ్రి కిక్కడ ఊపిరి సలిపే ఓపిక లేదు. అబ్బోడి స్నేహితులెవరో వ్రాసిన జాబులో యుద్ధం నిలిచిపోయిందని తెలిసింది గానీ గెలుపు తమదే అయినా అబ్బోడితో పాటు ఐదుమంది టాంకు నొకదానిని కైవసం చేసుకొంటున్నపుడు గాయపడ్డారట. ప్రాణభయం మాత్రం లేదన్నాడు. కస్తూరి బేటప్పకీ విషయాన్ని చెప్పనేలేదు. గాయపడ్డాడని వింటే బేటప్ప కూడా మంచాన పడిపోతాడేమోనని ఆ పసిహృదయం భయపడింది.

తొమ్మిదో మట్టులో గంగ తొంగి చూచితీరాలి. అంతరాత్మ అల్లాగే ప్రబోధిస్తున్నది బేటప్పకు. వల్లేరు పెంటయ్య కటవ బావిని తవ్వించినప్పుడు తొమ్మిదో నిలువులో నమ్మకంగా నీరు పడిందంటారు. అది తవ్వింది ధాత కరువులో. పెంటయ్య జలార్గళ శాస్త్రవేత్త కాకున్నా రాత్రిపూట బావిలో పడుకొని జలధార దిక్కు కనిపెట్టేశాడట. అలాగే తానూ ప్రయత్నిస్తే! కస్తూరి నొక్కతెనే గట్టుమీద గుడిసెలో పెట్టి తానెలా బావిలో పడుకోవడం! బేటప్ప దీర్ఘంగా ఆలోచించాడు. ప్రతిరాత్రీ నాలగవ జాములో బావిలో దిగి అడుగడుగునా చెవుల నానించి వింటూ వచ్చాడు. పగలంతా బండతో ప్రచండ యుద్ధం. రాత్రుల్లో గంగాన్వేషణంలో జాగరణం! పక్షం రోజులు గడిచిపోయినవి. పదహారోనాటి రేయి వేగుచుక్క పొడిచిందే బావిలో దిగి ఈశాన్యం వైపు తల ఉంచి పడుకొన్నాడు.

అది బ్రహ్మముహూర్తం. ఈశాన్య మూల నుండి ఏదో ధ్వని విన్పించింది. పదేళ్ళ క్రితం విన్న తలకోన జర్తెలోని ప్రణవాన్ని స్మృతికి తెచ్చింది. మరీ దగ్గిరికి జరిగి చెవినిచ్చి విన్నాడు. ఆ మూలనే ముక్కాలు మట్టెత్తులో సప్తస్వరాల సమ్మేళనం వలె పాతాళగంగ పాడుతున్న పాట వినిపించింది.

బేటప్ప శివలాగా చీకటిలోనే పైకి వచ్చేశాడు. ముఖం కడుక్కొన్నాడు. నొసట కుంకుమ పెట్టుకొన్నాడు. పొరగడుపునే తేటగా కూటి నీళ్లిమ్మని ఒక్క లోటా త్రాగాడు.

బాలభానుని దివ్య ప్రభలతో పావురాల గుట్ట దేదీప్యమానంగా వెలిగి పోతున్నది. బేటప్ప పొద్దు కెదురు తిరిగి దండం పెట్టి బావిలోనికి దిగాడు. గడ్డపార ఎత్తి ఈశాన్య మూలలో పొడిచాడు. ఈశాన్యుని జటాజూటం కాస్త కదిలిందేమో! నెరికెలో నుండి చుక్కలు చుక్కలుగా నీరు కారుతున్నది. రెండు

మూడు చుక్కలు కింద పడగానే కస్తూరి వచ్చి గట్టున నిలబడింది. చూస్తుండగానే గలగలమంటూ కపిల లావునీరు దూకింది. కస్తూరి కనుకొలకుల్లో ఆనంద్రాశువులు నర్తిస్తూండగా పెల్లుబికిన సంతోషంతో కొయ్యబారినట్లు నిలిచిపోయింది. బేటప్ప పలుగునెత్తి నాలుగడ్డేళ్లలో తూర్పుగానున్న చీలికను కదిలించాడో లేదో అది అమాంతం పైకి దొర్లింది. నిండు చెరువు గండి పడ్డట్టుగా కోటిచిమ్ముడు గొట్టాల ఊటను, ఆ నీటి తేటను తిలకించే కస్తూరి పాదాలపై బడ్డ బండను తొలగించుకోజాలక బోర్లాపడ్డ బేటప్పను గమనించనే లేదు. పొంగులెత్తే గంగమ్మను తొంగిచూస్తూ గంగ వెర్రులెత్తుకొన్న రైతాంగన కస్తూరి!

బావి నీటితో నిండిపోతున్నది. ఎంత బాగున్నదా దృశ్యం! కానీ ఆ మూల నీటి చాలులో పొటమరించిన ఎర్రని చారలెక్కడివి? అసలు మావయ్యేడీ? ఎక్కడ? ఎక్కడా? "మావయ్యో! మావయ్యో? మావయ్యో" గావుకేక పెట్టింది కస్తూరి.

మావయ్య లేడు. ఇక రాడు! "మావయ్యో! మావయ్యో!" గుండెల్ని బాదుకొంటున్నది. బావిలో పాషాణం కూడా కరిగి నీరైపోతున్నది. ఆ విషాద సాగరాన్ని వీక్షించడానికి గగనంలో సూర్యుడు తన గమన వేగాన్ని హెచ్చించాడు.

కనుచూపు మేరలో ఖాకి దుస్తులతో కాళ్లీడ్చుకొంటూ వస్తున్న మనిషి కస్తూరి పెడబొబ్బల్ని విని పరుగెత్తి వచ్చాడు. అతడు సమీపించేలోగా మరో అరమట్టు నిండిపోయింది. ఆ మనిషి వచ్చీ రావడంతోనే ఎర్రని కవరును చేతికందిచ్చాడు. పిచ్చి పిచ్చి చూపులతో గడగడలాడుతున్న చేతులతో చించి చూచింది కస్తూరి.

ఆనందం అస్తమించాడు. అబ్బోడన్నది ఆనందం ముద్దు పేరు. అసలు పేరు ఆనందమే. ఆనందమే అదృశ్యమై పోయిన కస్తూరి కన్నులను తొలుచుకొని ప్రభవించినది పాతాళగంగ.

అయ్యో! అయ్యో! అయ్యయ్యో! పాపం! పాపం! అనుకొంటూ ఆ మనిషి నాలుగడుగులు ముందుకు వెయ్యగానే దబేలుమన్న శబ్దం విన్పించింది. తపాలాయన వెనుదిరిగి బావివైపు దృష్టిని సారించాడు. తంతి నందుకొన్న అమ్మాయి ఏమైనట్లు? గట్టున నిలబడి తొంగి చూశాడు.

నీటిమట్టం పెరుగుతూనే ఉన్నది. తలమున్కలు వేస్తూండే కస్తూరిని చూచి ఊపిరి బిగబట్టి బిగ్గరగా అరిచాడు. రస్తాలో పోతున్న బస్సు ఆగింది. అందరూ వచ్చి గట్టున నిలబడ్డారు. బేటప్పతో పాటు కస్తూరి కూడా గంగలో శయనించింది.

తలకశం నుండి తడిబట్టల్ని ఆరవేసుకొంటూ నంది కృష్ణయ్య కూడా అప్పుడే వచ్చాడు. అతని గొంతు మూగవోయింది. ఈ గొడవతో మనకేం పని అనుకొన్న ఒక విలాస పురుషుడు మారేడు చెట్టు క్రింద సమాధిపై కూర్చుని చిన్న పెట్టె నెత్తి చేతపట్టుకొన్నాడు. సజీవమైన కంఠం పెద్దగా వినిపించింది.

"జైజవాన్ జై కిసాన్... జై భారత్..." ఈ పాటను విన్నదేమో పాతాళగంగ మరీ మరీ పరవశత్వంతో పైపైకి పొంగుతూంది. ఇంకా పొంగుతూనే వున్నది.